ప్రజాశక్తి


బుధవారం 16 ఆగస్టు 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు





నరసరావుపేటలో జెండా వందనం చేస్తున్న పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కారుమూరు వెంకట నాగేశ్వరరావు కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, గుంటూరులో జెండా వందనం చేస్తున్న ఇన్‌ఛార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రగతి

స్వాతంత్ర్య దినోత్సవాల్లో గుంటూరు, పల్నాడు జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు ధర్మాన ప్రసాదరావు కారుమూరి వెంకట నాగేశ్వరరావు - జాతీయపతాక ఆవిష్కరణ - ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన - అధికారులకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. మంగళవారం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన 77వ స్వాతంత్ర్య దినోత్సవాల్లో మంత్రి ధర్మానప్రసాదరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. పెదనందిపాడులో సహాయ నిరాకరణోద్యమం, సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా గుంటూరు, తెనాలిలో ఆందోళనలు, క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో ఏడుగురు తెనాలి ప్రజలు ప్రాణ త్యాగాలు చేయడం ద్వారా స్వాతంత్ర్యోద్యమంలో జిల్లా ఒక ప్రముఖ పాత్రను పోషించి ప్రత్యేక స్థానమును కలిగి ఉందనిగుర్తు చేశారు. అమ్మఒడి, రైతు భరోసా, విద్యాదీవెన, విద్యాకానుక, వసతి దీవెన, ఆసారా, చేయూత, చేదోడు, నేతన్న నేస్తం, ఈబిసి నేస్తం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, సున్నా వడ్డీ తదతర పథకాల ద్వారా జిల్లాలో లక్షలమంది పేదలకు లబ్ధి చేకూరిందన్నారు. ఆయా శాఖల ద్వారా చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామ వార్డు సచివాలయాలు, వాలంటీర్ల ద్వారా పరిపాలన పేదవాడి ఇంటి ముందుకు తీసుకువచ్చామన్నారు. సంక్షేమపథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నట్టు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరిస్తూ పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పాతగుంటూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, యాదవ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల, ఎల్బీనగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, హిందూ కళాశాల ఉన్నత పాఠశాల, సెయింట్ జోసఫ్స్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు దేశభక్తి గీతాలకు అనుగుణంగా చేసిన ప్రదర్శనలు కన్నుల పండుగలా కొనసాగాయి. అమరులైన సైనికుల వీరమాతలు విజయలక్ష్మీ, సుబ్బమ్మ, కొల్లి జానకిలను మంత్రి ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ ఘనంగా సన్మానించారు. శకటాల ప్రదర్శనలో మొదటి బహుమతి పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు, రెండవ బహుమతి విద్యాశాఖకు, మూడవ బహుమతి నీటి యాజమాన్య సంస్థకు దక్కాయి. సాంస్కృతిక ప్రదర్శనలో మొదటి బహుమతి యాదవ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, రెండవ బహుమతి హిందూ కళాశాల హైస్కూల్ విద్యార్థులకు, మూడవ బహుమతి సెయింట్ జోసఫ్స్ బాలికల హైస్కూల్, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు, ఇస్రో నిర్వహించిన యంగ్ ఇండియన్ సైంటిస్ట్ పోటీలలో సెలక్ట్ అయిన జిల్లాకు చెందిన ఐదుగురు విద్యార్థులకు మెమోంటోలు అందించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన పోలీసులకు మహోన్నత సేవా పతకాలు. అధికారులు, ఉద్యోగులకు ప్రసంశ పత్రాలను మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రదానం చేశారు. అనంతరం వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థకు మొదటి బహుమతి, నాబార్డుకు రెండవ బహుమతి, వ్యవసాయ శాఖకు మూడవ బహుమతిని కలెక్టర్ అందించారు.

సూక్ష్మ సేద్యం ద్వారా పది ▶ 2లో

కీర్తిప్రతిష్టలు కలిగిన పల్నాడు జిల్లా

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా అంటేనే అన్ని వర్గాల ప్రజల హితం కోరే జిల్లాగా, పౌరుషాల పురిటి గడ్డగా కీర్తి ప్రతిష్టలు గాంచిందని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని సత్తెనపల్లి రోడ్డులో గల జిల్లా క్రీడా ప్రాంగణంలో మంగళవారం జరిగిన 77వ స్వాతంత్ర్య దినోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా ప్రగతిని వివరించారు. తొలుత మంత్రికి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జెసి శ్యామ్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డిఆర్ఓ వినాయకం ఘన స్వాగతం పలికారు. సంక్షేమ, అభివృద్ధి శకటాలు, స్టాల్స్ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. పలువురు ప్రదర్శించిన విన్యాసాలు, విద్యార్థుల నత్య ప్రదర్శనలను తిలకించి, ఉత్తమ సేవలను అందించిన అధికారులకు సేవా పురస్కారాలను, అవార్డులను, ప్రశంసా పత్రాలను మంత్రి ప్రదానం చేశారు. ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు కలిసి స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలను సత్కరించారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో విజేతలుగా నిలిచిన వివిధ పాఠశాలల విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. డీఎల్పీవో కార్యాలయంలో జెండాను డీఎల్పీవో డాక్టర్ పి.రమణయ్య ఎగురవేశారు. హరికృష్ణ, శ్రీనివాసరావు, అపర్ణ, సూరయ్య పాల్గొన్నారు.

నేటి నుండి విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ ఉద్యోగులకు తిరోగమన వేతన ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆగస్టు 16, 17, 18 తేదీల్లో ప్రతి విద్యుత్ కార్యాలయం వద్ద నిరసనలు తెలియజేయాలని జిల్లా విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ నాయకులు సిహెచ్ నాగబ్రహ్మాచారి, దాసరి వెంకటేశ్వరరావు, గురుబ్రహ్మం, బి.లక్ష్మణరావు, జి.నాగరాజు, జి.పవన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల వేతనాలు పెంచకుండా తగ్గించే ▶ 2లో



కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నాగరాజుకు నోటీసు ఇస్తున్న పోలీసులు



5లో

తాడేపల్లి ప్రతిజ్ఞ చేయిస్తున్న పాశం రామారావు

మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధంకండి



సంచిక ఆవిష్కరణలో నాయకులు

నిత్యం ప్రజల పక్షానే ప్రజాశక్తి

4లో

జాతీయ జెండాతో లోకేష్ పాదయాత్ర

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్, మంగళగిరి

నిడమర్రు నుంచి ప్రారంభమైన లోకేష్ యువగళం పాదయత్రకు ప్రజలనుంచి అపూర్వ స్పందన లభించింది. 185వ రోజు జరుగుతున్న పాదయాత్రలో భాగంగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని త్రివర్ణపతాకం చేబూని లోకేష్ పాదయాత్ర నిర్వహించారు. కార్యకర్తలు జాతీయ జెండాలు పట్టుకొని పాదయాత్రలో నడిచారు. పాదయాత్రకు సంఘీభావంగా మంగళగిరి ప్రజలు, అభిమానులు తరలవచ్చారు. భారీ గజమాలలతో స్వాగతం పలికారు. అందర్నీ లోకేష్ పలకరిస్తూ సమస్యలు వింటూ మంగళగిరి వరకు ఈ పాదయాత్రను కొనసాగించారు.

సర్పంచుల వినతి

సర్పంచులు తమ సమస్యలను లోకేష్ దృష్టికి తెచ్చారు. పంచాయతీ నిధులను కాజేశారని, ప్రభుత్వం కొల్లగొట్టిన ▶ 2లో



సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రగతి

(మొదటి పేజీ తరువాయి)

మందికి రూ.5.74 లక్షల విలువ గలిగిన స్ప్రింకర్లు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, డీఆర్డీఏ ద్వారా స్త్రీనిధి పథకం ద్వారా8617 మహిళా సంఘాల గ్రూప్ లకు మంజూరైన రూ. 46.08కోట్లు, వికలాంగుల శాఖ ద్వారా రూ. 3.16 లక్షల విలువ కలిగిన ఉపకరణాలు మూడు చక్రాల మోటర్ వాహనములు రెండు, ట్యాప్ ట్యాప్ రెండు, టచ్ ఫోన్ లు రెండు, శ్రవణ యంత్రాలు రెండు, వీల్ చైర్స్ రెండు ఉచితంగా, మత్స్య శాఖ ద్వారా ఫిష్ ఆంధ్ర పథకంలో మంజూరైన ఆటోలు, వ్యాన్‌లను లబ్ధిదారులకు కలెక్టర్ అందించారు. జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డా. పీపీ వావా, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హెనీ కత్తెర క్రిస్టీనా, ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఏసురత్నం, ఎమ్మెల్యే మద్దాళి గిరిధరరావు, జెసి రాజకుమారి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుండి విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

విధానాన్ని అవలంబిస్తోందని అన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంట్రాక్ట్ కార్మికులకు తీవ్ర ద్రోహం చేశారని, జెఎల్ఎం గ్రేడ్-2లకు ఎపిఎస్సీబిల సర్వీసు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. 17న చలో విద్యుత్ సౌధకు పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లా నాయకులకు పోలీసులు నోటీసులు ఇవ్వటాన్ని స్ట్రగుల్ కమిటీ నాయకులు ఖండించారు. కార్యక్రమంలో పాల్గొంటే ఎస్మా చట్టం ప్రయోగిస్తామని, క్రిమినల్ కేసులు పెడతామని బెదిరించటం, విజయవాడలో 144 సెక్షన్ అమలు చేయటం వంటివి ప్రభుత్వ నియంతృత్వ విధానానికి నిదర్శమని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగులపై నిర్బంధం మానుకొని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని పాలువాయి గేటు గ్రామంలో శనివారం రాత్రి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. రైతు అత్తలూరి లక్ష్మయ్య పొలంలో ఉన్న 25 కే.వి ట్రాన్స్ఫార్మర్, అందులోనే రాగి తీగలను దుండగులు ఎత్తుకెళ్లారు. ఇతర విడి భాగాలను పొలంలో వదిలేశారు. చోరీకి గురైన వస్తువుల విలువ రూ.50 వేలు ఉంటుందని రైతు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో మోటారు అవసరం పెరిగిన నేపథ్యంలో చోరీ రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

మార్త గ్రూప్ ఆఫ్ సంస్థల్లో స్వాతంత్ర్య దినోత్సవాలు

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక సుల్తానాబాద్ లోని మార్తా గ్రూప్ ఆఫ్ ఇన్సిట్యూషన్స్ ఆధ్వర్యంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



ఆడంబరంగా నిర్వహించారు. మార్తా గ్రూప్ ఆఫ్ ఇన్సిట్యూషన్స్ అధినేత, యనమల రామయ్య ఎడ్యుకేషనల్ సొసైటీ సంస్థ సెక్రెటరీ యనమల ఈశ్వర్ జాతీయ జెండా ఆవిష్కరించి విద్యార్థులకు స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తమ సంస్థ ద్వారా రాబోయే కొత్త విద్యాసంస్థలు గురించి వివరించారు. అనంతరం నర్సింగ్ విద్యార్థినులు తో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్త నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్, ఎస్ఆర్బి నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్, తెనాలి టీవీ యూనిట్ ఇంచార్జి రవి కుమార్ , గుంటూరు డిజిటల్ సర్వీసెస్ అధినేత ప్రభాకర్, కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



ప్రజాశక్తి-తెనాలి

ప్రజారోగ్య పర్యవేక్షణలో నిత్యం సేవలందిస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ మార్కెట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. సమస్యలపై మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి మంగళగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేసి, శాశ్వత ప్రాతిపదికన వైద్యుడిని నియమించాలని కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు ములక శివ సాంబి రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ వెంకటేశ్వర్లు, సుధాకర్, మరియమ్మ, మాధవి, సునీత, గౌరమ్మ, అనురాధ, సారమ్మ, సంతోషం, నాగలక్ష్మి పాల్గొన్నారు.

డాల్ మిల్ ముఠా కార్మిక సంఘం నిరసన

డాల్మిల్ ముఠా కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ మున్సిపల్ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద నిరసన వ్యక్తం చేసి, గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ముఠా కార్మికుల సమస్యలు పరిష్కారానికి చట్టం తేవాలని, కార్మికులకు ప్రతిరోజు పని కల్పించాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని, ఈఎస్ఐ ఈపీఎఫ్ కార్మికులందరికీ అమలు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జె వెంకటసుబ్బయ్య, సిహెచ్ శేషగిరిరావు, స్టాలిన్, శ్రీనివాసరావు, రంగయ్య ,వెంకట రమణారెడ్డి శివారెడ్డి, షేక్ హుస్సేన్ వలి పాల్గొన్నారు.

మేడికొండూరులో చోరీ

ప్రజాశక్తి - మేడికొండూరు

మండల కేంద్రమైన మేడికొండూరులో మంగళవారం తెల్లవారుజామున ఒక ఇంట్లో చోరీ జరిగింది. సుమారు రూ.1.65 లక్షల బంగారు, నగదును దుండగులు అపహరించారు. మేడికొండూరుకు చెందిన గుంటుపల్లి నాగేశ్వరరావు తన ఇంటి ప్రధాన ద్వారం గాలి కోసం తెరిచి ఇంట్లో కుటుంబంతో నిద్రిస్తున్నాడు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి గోడకి ఉన్న వంకేకు తగిలించిన బీరువాతాళాలు తీసుకుని బీరువా తెరిచి బీరువాలో ఉన్న బంగారము కొంత నగదు దొంగిలించి అనుమానం రాకుండా యథావిధిగా బీరువా డోర్లు మూసి వంకి ఉండవలసిన తాళాలు వంకెకు తగిలించి వెళ్లారు. మంగళవారం ఉదయం బీరువా తెరిచి చూడగా అందులో ఉండవలసిన 64 గ్రాముల బంగారం, కొంత నగదు కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగిందని భావించి బాధితుడు మేడికొండూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలను సేకరించారు.



రైతులు, పేదలకు టిడిపి సాయం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో ఇప్పటంలో రైతులకు ఉచితంగా తైవాన్ పంపులు 5, బ్యాటరీ పంపులు 20, తోపుడు బళ్ళు2, మరో 10 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.లక్ష ఆర్థిక సహాయం మంగళవారం అందచేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, పట్టణ మాజీ అధ్యక్షులు జంగాల సాంబశివరావు, మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్, ఇప్పటం గ్రామ అధ్యక్షులు ఎస్.పిచ్చయ్య, కాలేష, జె.మహేంద్ర, జె.రత్తయ్య పాల్గొన్నారు.



దుస్తులు, బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - తాడికొండ : ప్రతి ఒక్కరు సాటివానికి సహాయపడాలని వైసిపి తాడికొండ నియోజకవర్గం సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. తాడికొండ శిరిడి సాయిబాబా మంది ఆవరణలో మంగళవారం బెజ్జం సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు, వాలంటీర్లు, 108 సిబ్బంది, పంచాయతీ కార్మికులకు దుస్తులు బియ్యం పంపిణీ చేశారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ పేదలకు సాయం అందిస్తున్న బెజ్జం సాయి ప్రసాదును అభినందించారు. బి.బ్రహ్మారెడ్డి, సర్పంచ్ టి.సరోజినీ నరసింహారావు, మాజీ ఎంపిపి కె.రామచంద్రరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ సిహెచ్.పూర్ణచంద్రరావు, బి.వెంకటేశ్వరరెడ్డి, బి. సాంబశివరావు, వి.పోలారెడ్డి పాల్గొన్నారు.

జాతీయ జెండాతో లోకేష్ పాదయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

14, 15 ఆర్థిక సంఘం నిధులు తిరిగి ఇప్పించేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టిడిపి అధికారంలోకి వస్తే పంచాయతీలను ఏ విధంగా అభివృద్ధి చేస్తుందో ఎన్నికల మేనిఫెస్టోలో రూపొందించాలని కోరారు. లోకేష్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా తాను తెచ్చిన ఎన్నో సంస్కరణలను వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, పంచాయితీలకు పూర్వ వైభవాన్ని తీసుకువస్తానని చెప్పారు.

లోకేష్‌ను కలిసిన దుగ్గిరాల పసుపు రైతులు

నిడమర్రు సెంటర్లో దుగ్గిరాలకు చెందిన పసుపు రైతులు లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గతంలో దేశవాళీ బేకరీపేట రకం విత్తన పంటకు ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉండి, రైతులు, వ్యాపారులకు లాభదాయకంగా ఉండేదని చెప్పారు. కాలక్రమంలో ఆ రకం పంట అంతరించి, పసుపుపంట విస్తీర్ణం కూడా తగ్గిపోయిందని, సేలం రకం పసుపు విత్తనాలు మాకు అందుబాటులోకి తెప్పించగలిగితే ఇతర రాష్ట్రాల మాదిరిగా మాకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉందని తెలిపారు. గతంలో హార్టికల్చర్ శాఖ తరపున హెక్టారుకు రూ.12500 సబ్సిడీ అందించేవారని, 2020లో తర్వాత రాయితీలేమీ రావడం లేదని అన్నారు. ఈ-నామ్ టెండర్ విధానం వల్ల రైతులు అవగాహనలేక పసుపును మార్కెట్ యార్డ్ కు తీసుకురావడం లేదన్నారు. ఓపెన్ ఆక్షన్ లేకపోవడంతో దళారుల ప్రమేయంతో పసుపు రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో దుగ్గిరాలలో 12 వరకు పసుపు పరిశ్రమలు ఉండేవనీ, ప్రస్తుతం సరిగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో యంత్ర సామగ్రి దెబ్బతిని, కేవలం నాలుగైదు యూనిట్లు మాత్రమే నడుస్తున్నాయని వివరించారు. లోకేష్ స్పందిస్తూ వ్యవసాయంపై అవగాహన లేని ముఖ్యమంత్రి కారణంగా రాష్ట్రంలో రైతాంగం నానా అగచాట్లు పడుతున్నారని, రైతులకు అవసరమైన విత్తనాలను కూడా సరఫరా చేయక పోవడం ఈ ప్రభుత్వ దివాలాకోరు తనానికి అద్దం పడుతోందని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక పసుపు పంటకు హార్టికల్చర్ సబ్సిడీలను అందిస్తామని, రైతులు కోరుకుంటున్న విధంగా సేలం రకం విత్తనాలను అందుబాటులోకి తెస్తామని అన్నారు. పసుపు పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తామని, మెరుగైన మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి మద్దతు ధరలు లభించేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

అభివృద్ధి అంటే రంగులు వేసుకోవడమేనా?

నిడమర్రులో పేదలకోసం గత టిడిపి ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాల వద్ద లోకేష్ సెల్ఫీ దిగారు. కొత్తగా ఇళ్లు కట్టడం చేతగాని జగన్ మేం నిర్మించిన ఇళ్లకు మాత్రం వైసిపి రంగులేసుకున్నారని ఎద్దేవ చేశారు. స్టిక్కర్లు వేసుకోవడమేనని, కూల్చివేతలు మినహా పదవీకాలం ముగిసే లోపు ప్రజలకోసం నేను ఫలానా మంచి పని చేశానని ఒక్కటైనా చూపించగలరా? అని అన్నారు.

విజనరీ పాలనకు ఇవే సాక్ష్యాలు

ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు ఉన్నత విద్యకోసం పొరుగురాష్ట్రాల బాట పట్టకూడదన్న ఉద్దేశంతో జాతీయస్థాయిలో పేరెన్నికగన్న అమృత విశ్వవిద్యాలయాన్ని గత ప్రభుత్వంలో అమరావతికి తెచ్చామని, విట్, ఎస్ఆర్ఎం లాంటి ప్రఖ్యాత విద్యాసంస్థలను కూడా ఆనాడు రాష్ట్రానికి రప్పించామని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ విద్యాలయాలకు వెళ్లేందుకు కనీసం రహదారి సౌకర్యం లేకుండా రోడ్డును తవ్వేసి విద్యార్థులను ఇబ్బందులు పాల్జేస్తున్నాడని విమర్శించారు. జగన్ ఏలుబడిలో రాష్ట్రంనుంచి వెళ్లిపోవడమే తప్ప కొత్తగా ఒక్క పరిశ్రమగానీ, విద్యాసంస్థగానీ వచ్చింది లేదన్నారు.

మంగళవారం రాత్రి మంగళగిరికి చేరుకున్న లోకేష్‌కు నిడమర్రు రైల్వే గేట్ వద్ద ఘన స్వాగతం పలికారు. మహిళలు లోకేష్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు ఆందోళనకు గురిచేస్తున్నాయని, మహిళల రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థినులు, యువతులకు ప్రత్యేక హాస్టల్స్ ఏర్పాటు చేయాలన్నారు. మద్యాన్ని నియంత్రించి, గంజాయి విక్రేతలపై చర్యలు తీసుకోవాలని, పరిశ్రమల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. లోకేష్ మాట్లాడుతూ నాలుగేళ్లలో మహిళలపై 52,587 నేరాలు జరిగాయని, ప్రతి గంటకు రెండు నేరాలు నమోదవుతూ మహిళల భద్రత గాలిలో దీపంగా మారిందని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక ఆడపిల్లల వైపు కన్నెత్తి చూడాలంటేనే భయపడేలా చేస్తామన్నారు. కృష్ణబలిజ సంక్షేమసంఘం ప్రతినిధులు లోకేష్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. లోకేష్ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే కృష్ణబలిజల ఆర్థిక ని ా ్య వ ల ం బ న క ు



చేయూతనిస్తామన్నారు. బిసి జనగణన ద్వారా ఆయా వర్గాల జనాభాను గుర్తించి న్యాయం చేస్తామని, ఇల్లులేని వారికి పక్కాగృహాలు నిర్మించి ఇస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.అబద్దయ్య, పి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, డి.రాజు, ఎ.భూలక్ష్మి, జానకిదేవి, ఐ.ఆశాబాల, పి.మహేష్, జి.దుర్గారావు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరునగరం, శివారులోని పలు విద్యా సంస్థల్లో మంగళవారం 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.





వర్సిటీలో మువ్వన్నెల రెపరెపలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో భాగంగా విశ్వవిద్యాలయంలో కొలువై ఉన్న జాతీయ నాయకుల, స్వాతంత్య్ర పోరాటయోధుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్ ముఖ్య అతిథిగా, రాష్ట్ర ఎన్. ఎస్. ఎస్ .అధికారి డా.పి.అశోక్ రెడ్డి ప్రత్యేక అతిథిగా, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్ మాట్లాడుతూ ఎందరో మహనీయుల జీవితాల త్యాగఫలం నేటి స్వతంత్ర భారతం అని,ప్రపంచాన భిన్నత్వంలో ఏకత్వం చాటే ఏకైకదేశం మన భారతదేశం అని పేర్కొన్నారు. విద్య ఏ వర్గానికీ పరిమితం కాదనీ విద్యార్థులంతా విద్యావేత్తలుగా ఎదగాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం దేశాభివృద్ధి కోసం విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, విశ్వవిద్యాలయ ఎన్.ఎస్.ఎస్. అసిస్టెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్. డి .రవి శంకర్ రెడ్డి ఆచార్యులు సీ హెచ్ స్వరూప రాణి, పి.సిద్దయ్య, పి.జాన్సన్, ఇ.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీమేధ విద్యాసంస్థల్లో..

స్థానిక బ్రాడీపేటలోని శ్రీమేధ విద్యాసంస్థల్లో నిర్వహించిన వేడుకల్లో కళాశాల చైర్మన్ అన్న నందకిషోర్ జాతీయ జెండా ఎగురవేసి, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు.



భాష్యం విద్యాసంస్థల్లో..

భాష్యం విద్యా సంస్థల్లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భాష్యం బ్లూమ్స్ సెకండరీ క్యాంపస్‌లో, ఆర్టీసి కాలనీ, ఎస్‌విఎన్ కాలనీ, సాంబశివపేట, పట్టాభిపురం, గోరంట్ల, భాష్యం మెడెక్స్, ఐఐటి క్యాంపస్‌లలో జెండా ఆవిష్కరణలు చేశారు. బ్లూమ్స్‌లో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ భాష్యం రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఎగురవేశారు. అలాగే 2023-24 విద్యా సంవత్సరానికి కొత్తగా ఎన్నికైన విద్యార్థుల ప్రమాణస్వీకారం చేయించారు.కార్యక్రమంలో భాష్యం ముఖ్య సలహాదారు మైఖేల్‌రాజ్, భాష్యం బ్లూమ్స్ జెడ్ఈఓ వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కన్న స్కూల్లో..

స్థానిక రైలుపేటలోని కన్న ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో కన్న విద్యా సంస్థల అధినేత కన్న మాస్టారు జాతీయ జెండా ఎగురవేశారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గీతాంజలి హై స్కూల్‌లో ..

ఏటి అగ్రహారం, రామిరెడ్డినగర్‌లోని గీతాంజలి హైస్కూల్లో 77 స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ జెండాను పాఠశాల డైరెక్టర్ షేక్.హుస్సేన్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. విద్యార్థులు స్వాత్రంత్య్ర సమరయోధుల వేషధారణలతో అలరించారు.కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ షాంషాద్‌భాను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజ్ఞా పాఠశాలలో..

నగరంపాలెంలోని ప్రజ్ఞ విద్యాసంస్థల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కార్యదర్శి నాయుడు చక్రనాగ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి స్వాతంత్రోద్యమం లో స్వాతంత్ర సమరయోధుల త్యాగాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



కెఎల్‌పి స్కూల్లో..

స్థానిక జెకెసి రోడ్డులోని కెఎల్‌పి స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ వై.రధినిచౌదరి పాల్గొని త్రివర్ణపతాకాన్ని ఎగురవేశారు. విద్యార్థులు స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలతో అలరించారు. విద్యార్థులు ప్రదర్శించిన లఘు నాటికలు, పిరమిడ్ ప్రదర్శన ఆకట్టుకున్నాయి.



పూజిత స్కూల్లో..

స్థానిక పట్టాభిపురంలోని పూజిత స్కూల్లో నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించి, నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన మార్చ్‌ఫాస్ట్, పిరమిడ్స్, డ్రిల్స్ ఆకట్టుకున్నాయి.

సుమేధా హైస్కూల్లో..



స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధా హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ జనరల్ డాక్టర్ ఆర్.హరికృష్ణ, స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి, జాతీయ జెండా ఎగురవేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సజ్జా జనార్ధనరావు పారితోషకం ఇచ్చి అభినంది ంచారు.

ఎసిఎంఇ స్కూల్లో..



పొత్తూరులోని ఎసిఎంఇ స్కూల్లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్లు సౌగంధ్ కృష్ణ, నందమూరి దీప్తి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పాల్గొన్నారు.



పట్టాభిపురం పిఎంసి హైస్కూల్లో..

స్థానిక పట్టాభిపురంలోని పిఎంసి హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ జెవిఎస్ నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీరబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గోరంట్లలోని సెయింట్ ఆన్స్..

సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో నిర్వహించిన వేడుకలకు ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ డాక్టర్ సిస్టర్ ఫాతిమారాణి.పి అధ్యక్షత వహించారు. జాతీయ జెండా ఎగురవేసి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్‌సిసి క్యాడెట్స్ ద్వారా ప్రిన్సిపాల్ గౌరవ వందనం స్వీకరించారు.కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో..

వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి విద్యార్థుల కవాతు ఆకట్టుకుంది. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో కాలేజి సెక్రెటరీ కోయి శేఖర్, ప్రన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజీలో..

చౌడవరంలోని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరి గాయి. జాతీయ జెండాను ట్రైనీ కలెక్టర్ ఆదిమూలం సాయిశ్రీ ఎగురవేశారు. ఎన్‌సిసి విద్యార్థులు కవాతు నిర్వహించారు. అతిథులు గాంధీ చిత్రపటానికి పూమాలలు వేసి నివాళులర్పించారు. కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కె.ట్రెజరర్ కృష్ణప్రసాద్ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.హరిబాబు, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విజ్ఞాన్స్ యూనివర్సిటీలో..

వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ, విజ్ఞాన్ లారా, ఫార్మసీ, జూనియర్ కళాశాలలో ఆధ్వర్యంలో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు. 100 మీటర్ల జాతీయ జెండాతో వర్సిటీ ప్రాంగనంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వీసీ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడారు. విద్యార్థులకు డిబేట్, మాక్ పార్లమెంట్, క్విజ్, డ్రాయింగ్, హ్యాండ్ పెయింటింగ్, ఎలక్యూషన్, షార్ట్‌ఫిల్మ్‌లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందచేశారు. ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.



టిజెపిఎస్ కాలేజీలో..

స్థానిక టిజెపియస్ కళాశాలలో నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండంట్. కె.వి.బ్రహ్మం ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమం ప్రిన్పిపాల్ ఏబిపి మనోహర్, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జె.వి సుధీర్ కుమార్, పీజీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్. యస్.అనితాదేవి, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి తదితరులు

నిత్యం ప్రజల పక్షానే ప్రజాశక్తి

వార్షికోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక అనుబంధం ఆవిష్కరణలో ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి -పల్నాడు జిల్లా

ప్రజల పక్షాన ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాశక్తి దినపత్రిక నిరంతరం పని చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజాశక్తి 43 వార్షికోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి దినపత్రిక ప్రచురించిన ప్రత్యేక అనుబంధాన్ని స్థానిక గుంటూరు రోడ్డులోని కొండవీడు ఇఎన్‌టి హాస్పిటల్‌లో బుధవారం ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక, కర్షక, పీడిత వర్గాల గొంతుకగా ప్రజాశక్తి పని చేస్తోందని కొనియాడారు. కార్యక్రమంలో పల్నాడు అర్బన్ డెవలప్మెంట్ ఛైర్మన్ మిట్టపల్లి రమేష్, జెడ్‌పిటిసి పి.చిట్టిబాబు, షేక్ కార్పొరేషన్ ఛైర్మన్ షేక్ ఖాజావలి మాస్టర్, కొండవీడు ఇఎన్‌టి హాస్పిటల్ అధినేత కంజుల జగన్మోహన్‌రెడ్డి, ప్రజాశక్తి నరసరావుపేట డివిజన్ ఇన్‌ఛార్జి జి.ప్రేమసాగర్, విలేకరి పచ్చవ బుజ్జిబాబు నాదెండ్ల, చిలకలూరిపేట, వినుకొండ, విలేకర్లు పాల్గొన్నారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి ఎల్.ఐ.సి ఎజెంట్స్ యూనియన్ నాయకులు రబ్బానీ, సిపిఎం నాయకులు సుభాని, ఐద్వా నాయకులు ఫాతిమా ఆవిష్కరించారు.



ఆవిష్కరిస్తున్న పక్కాల సూరిబాబు తదితరులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ప్రజాశక్తి ప్రచురించిన 43వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం'ను ప్రముఖ న్యాయవాది, వైసిపి నాయకులు పక్కాల సూరిబాబు తన కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాసమస్యలే ఎజెండాగా తీసుకొని ప్రజల పక్షాన రాసే పత్రిక ప్రజాశక్తి అని అన్నారు. పత్రిక దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆకుల హనుమంతరావు, దామర్ల సాంబశివరావు, ప్రజాశక్తి పల్నాడు జిల్లా ఇన్చార్జి నీరుకొండ కృష్ణ, విలేకరి మునగా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మైదవోలులో నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని మైదావోలులో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని టిడిపి మండల అధ్యక్షులు ఎన్.పోతురాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరాన్ని ఉదయం 10 గంటలకు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు ప్రారంభిస్తారని, అన్ని రకాల జబ్బులకూ పరీక్షలు, మందుల పంపిణీ ఉంటుందని తెలిపారు.

దేశాన్ని కాపాడుకోవడానికి యువత కదలాలి



జెండాను ఎగురవేస్తున్న గద్దె చలమయ్య

ప్రజాశక్తి-సత్తెనపల్లి

భారతదేశ స్వాతంత్ర్యం, సమైక్యత, సమగ్రత, రాజ్యాంగం ప్రమాదంలో పడ్డాయని, వాటిని కాపాడుకునేందుకు స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో యువత పునరుంకితం కావాలని సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య పిలుపునిచ్చారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి అధికారంలోకి వచ్చాక ప్రజల మధ్య మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టి అరాచకాలు, అక్రమాలకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రజలను అభద్రత భావానికి గురిచేస్తోందని, నేడు యువత స్వాతంత్ర దినోత్సవ స్ఫూర్తితో దేశ సమాఖ్యత, సమగ్రత, స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు పునరంకితం కావాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.బాలకృష్ణ, జె.రాజకుమార్, ఎ.ప్రసాద్‌రావు, పి.సూర్యప్రకాశరావు, జి.సుసులోవ్, పి.రామారావు, ఎం.జగన్నాధరావు, పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ప్రాంగణంలో జాతీయ జెండాను కేంద్రం కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి ఎగురవేశారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు)





కార్యాలయం వద్ద జెండాను యూనియన్ అధ్యక్షుడు కన్నెగంటి రామారావు ఎగురవేశారు. సిఐటియు జిల్లా కోశాధికారి డి.శివకుమారి మాట్లాడారు. వివిధ సంఘాల నాయకులు సిలార్ మసూద్, రామారావు, కోటేశ్వరావు, సుభాష్ చంద్రబోస్, కె.రామారావు, మస్తాన్‌రావు, ఎన్.కోటేశ్వరావు, ఎ.లలిత ప్రసాద్, కృష్ణ, బోసు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

కళలను, సాంస్కృతిక రంగాలను ప్రోత్సహించాలని, వాటి ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేయొచ్చని రైతుసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు అన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఆటాపాటా నిర్వహించారు. కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా గోపాలరావు



మాట్లాడుతూ కుల, మతాల మధ్య ఘర్షణలు పెచ్చరిల్లుతున్నాయని, వీటిని నియంత్రించేందుకు, ప్రజల్లో అవగాహన పెంచడానికి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతురెడ్డి, నాయకులు రంజాన్‌బి, తిరుమల లక్ష్మి, ఎస్‌కె నాసర్ బి, ఆర్.మునివెంకటేశ్వర్లు, సురేష్‌రాజా, మహేష్, కళాకారులు మూర్తిరాజు, రాజేష్, రోశయ్య పాల్గొన్నారు.



ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని మాచర్ల బస్టాండ్ సెంటర్లో సిఐటియు, రైతు సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుల దీక్ష శిబిరం పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలను సోమవారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి జె.కృష్ణానాయక్ అధ్యక్షత వహజంచగా సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం దేశభక్తి గీతాలు, విప్లవక గీతాలు పౌరాణిక గీతాలను సుజాత, జి.నాగేశ్వరరావు, టి.శ్రీనివాసరావు, ఆర్.నాగేశ్వరరావు, శ్రీరాములయ్య, డి.వెంకటేశ్వర్లు ఆలపించారు. బి.నాగేశ్వరరావు, జి.కోటేశ్వరరావు, ఎ.కోటిరెడ్డి, ఎం.నరసింహారావు, ఎస్.వెంకటకృష్ణ, షేక్ బాబు, కె.సీతారామయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

పలువురు అధికారులకు ప్రతిభా పురస్కారాలు



ప్రజాశక్తి - నూజెండ్ల

మండలంలోని వి.అప్పాపురం రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులు (విఎఎ)గా పనిచేస్తున్న పగడాల అశోక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ప్రశంసా పత్రాన్ని నరసరావుపేటలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రదానం చేశారు. అశోక్‌ను వినుకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రవిబాబు, ఏవో సుగుణా బేగం, ఏఈవో ఎలీషా, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి - రాజుపాలెం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలో ఐదుగురికి ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. ఎంపిడిఒ టి.శ్రీనివాసరావు, ఎంఇఒ



మంత్రి నుండి పురస్కారాన్ని అందుకుంటున్న ఎంపిడిఒ టి.శ్రీనివాసరావు

బి.మల్లికార్జునశర్మ, గ్రంథాలయ అధికారి కె.ఎస్.ఎస్.ప్రసాదు, ఎపిఒ వెంకటేశ్వర్లు, ఎపిఎం సునీత ఇన్‌ఛార్జి మంత్రి నుండి అవార్డులను అందుకున్నారు.



ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడుకు చెందిన షేక్ బాలి షాహిద్ సత్తెనపల్లి ఏపీపీగా పని చేస్తున్నారు. ప్రభుత్వం తరపు ఎప్పటి నుంచో పెండింగ్లో ఉన్న 15 కేసులను అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా వాదించి గెలుపొందారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవంలో గుంటూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు నుండి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.



రీసర్వే పూర్తిలో ప్రతిభ చూపినందుకు గాను మండలంలోని లింగంగుంట్ల విఆర్ఒ జాన్‌సైదాకు పురస్కారం లభించింది. ప్రశంసాపత్రాన్ని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నుండి అందుకోగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

తాళ్లూరులోని ఐసిడిఎస్, సిడిపిఒ స్వర్ణకుమారి ఉత్తమ సిడిపిఒ ప్రశంసా పత్రం అందుకున్నారు. ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి - రెంటచింతల

తహశీల్దార్ కె.పుల్లారావు ఉత్తమ ప్రతిభా అవార్డును జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నుండి అందుకున్నారు. కౌలు రైతుల కార్డుల పంపిణీ, స్పందన ఫిర్యాదుల



పరిష్కారం, హైవేకు భూ సేకరణ, జగనన్న భూహక్కు భూ రక్ష పథకం రీ సర్వే తదితర అంశాల్లో ప్రతిభ చూపినందుకుగాను అవార్డుకు ఎంపికయ్యారు. ఆయనకు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణ సిఐ యూత్ శోభన్ బాబుకు ఉత్తమ ప్రతిభా పురస్కారం లభించింది. 77వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం పల్నాడు జిల్లా నరసరావుపేటలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కె.నాగేశ్వరరావు నుండి పురస్కారాన్ని అందుకున్నారు.



మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధంకండి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

సిపిఎం, సిఐటియు, రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాల వద్ద రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ


తెనాలిలో


మంగళగిరిలో


తాడేపల్లి రూరల్ గుండిమెడలో


దుగ్గిరాలలో


తాడేపల్లిలో ప్రతిజ్ఞ


పెదనందిపాడులో


తెనాలి రూరల్ మండలం గుడివాడలో


తుళ్లూరులో


ఫిరంగిపురంలో

ప్రజాశక్తి-తాడేపల్లి :దేశంలో కార్మిక హక్కులు హరించబడు తున్నాయని, రైతాంగ సమస్యలకు పరిష్కారం దొరకడంలేదని, మతోన్మాదం పెచ్చురిల్లుతోందని వీటిని ఎదుర్కొనేందుకు ప్రజలు మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రకాష్‌నగర్, తాడేపల్లిలో ఆయన మాట్లాడారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఏ పాత్ర లేని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నేడు దేశాన్ని ఏలుతున్నాయని విమర్శించారు. దేశభక్తి పేరుతో దేశాన్ని తిరోగమనం వైపు నడిపిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, కొట్టె కరుణాకరరావు, వేముల దుర్గారావు, ఎస్.ముత్యాలరావు, గోపిరెడ్డి, కె.మేరి, వై.బర్నబస్, బి.దశరధరామిరెడ్డి, డివి భాస్కరరెడ్డి, కె.బాబూరావు, సుంకన్న, ఎన్.దుర్గారావు, శాస్త్రి, వెంకటయ్య, గంజి శ్రీనివాస్, యోహాన్ పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో ఆటపాట

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆట పాట మాట కార్యక్రమం నిర్వహించారు. ప్రకాష్‌నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు, సిఐటియు కార్యకర్తలు పాల్గొని వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి వేముల దుర్గారావు, కె.లక్ష్మి, రేణుక, ఎం.దుర్గారావు, సరళ, కవిత, సుజాత, కోటేశ్వరి, మాధవీలత పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి :నరేంద్ర మోడీ పరిపాలనలో రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే విధానాలను ఆలంబిస్తున్నారని దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలపై ఉందని సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు అన్నారు. 77వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా మంగళవారం ఎయిమ్స్ ఆటో సెంటర్ లో జాతీయ పతాకాన్ని రాఘవులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో ప్రజల మధ్య కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతుందని విమర్శించారు. లౌకిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, పట్టణ నాయకులు ఎం బాలాజీ, ఎస్ వెంకటేష్, ఆటో యూనియన్ నాయకులు ఎం వి సుబ్బారావు, వి వెంకట రమణయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకొని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదీ అని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు అన్నారు. ఎం టి ఎం సీ పరిధిలోని గుండిమెడ, వడ్డేశ్వరం గ్రామాలలో భారత స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా, సిపిఎం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగాన్ని కాపాడుకో వాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద నాయకులు ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గుండి మెడ గ్రామంలో అంబేద్కర్ చిత్రపటానికి సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు సిపిఎం నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగానికి ముప్పు వాటిల్లిందని అన్నారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడు నెలల చట్టాలను తీసుకువచ్చారని, రైతాంగం స్వాతంత్ర ఉద్యమాన్ని తలదన్నే రీతిలో ఉద్యమం చేపట్టి, అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసిన ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం మూడు నెలల చట్టాలను వెనక్కి తీసుకుందని ఆయన అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే అనేక మంది పై కేసులు పెట్టి, దేశ ద్రోహులు గా ముద్ర వేశారని సి పి యం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకట రెడ్డి అన్నారు. ఇటీవల మణిపూర్ రాష్టంలో జరిగిన ఘటనలే బిజెపి అరాచక పాలనకు నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, బత్తుల సంసోను, గుడివాడ సామ్యవాదం, బత్తుల వెంకటేశ్వరరావు,పల్లె భార్గవ్, వడ్డేశ్వరం గ్రామ సిపిఎం శాఖ కార్యదర్శి వడ్డేశ్వరం పున్నయ్య, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్కే పాపాసాహెబ్, గుడిసె శ్రీనివాసరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు:భారత రాజ్యాంగాన్ని తూట్లు పొడిచేలా బిజెపి సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని సిఐటియు రాజధాని కమిటీ కార్యదర్శి ఎం భాగ్య రాజు అన్నారు. సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అంటూ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి బాబురావు, జె నరేంద్ర, నరేష్, సాల్మన్ రాజు, పి మల్లేశ్వరరావు, ఎన్ నాగరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి:భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వ పాలన ఉందని సిపిఎం పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం సీపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బాబుప్రసాద్ మాట్లాడుతూ పౌరుల హక్కులను, విధులను సక్రమంగా అమలయ్యేందుకు రాజ్యాంగ వ్యవస్థ ఉందన్నారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని పాలకులు దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని, ఈ పరిణామాలకు వ్యతిరేకండా సిపిఎం దేశ వ్యాప్తంగా పోరాటం చేస్తోందన్నారు. దానిలో భాగంగానే నిరసన వ్యక్తం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు షేక్ హుస్సేన్‌వలి, ములకా శివసాంబిరెడ్డి, పి.జోనేష్, కె.రవికుమార్; ఫణీంద్ర, సుధాకర్, మంగళగిరి వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరరావు, ఆర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.**తెనాలి రూరల్ :** కేంద్రంలో మోదీ సర్కార్ తొమ్మిదేళ్ళ పాలనలో రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడిచారని ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి రూరల్ మండలం గుడివాడలో అంబేద్కర్ విగ్రహం వద్ద రైతులతో ప్రతిజ్ఞ చేయించారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల : దుగ్గిరాల పోలీసు స్టేషన్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జెట్టి బాలరాజు నాయకులు యన్ యోగేశ్వరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఎలాంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. మణిపూర్ లో మహిళలుపై జరుగుతున్న అఘాత్యాలను ఆపేందుకు ప్రధానమంత్రి మోడీ పూనుకోలేదని కనీసం ఖండించనూ లేదని అన్నారు హింసను అరికట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వై. బ్రహ్మేశ్వరావు జి. శ్రీనివాసరావు యం. నాగమల్లేశ్వరావు సిహెచ్. పోతురాజు రత్నం సాంబయ్య గోపాలకృ ష్ణ, సిహెచ్ సింధు పాల్గొన్నారు.

పెదనందిపాడు: సిపిఎం పెదనందిపాడు కమిటీ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్లోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనందరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, నాయకులు జంపని రామారావు, కొత్త శివ నాగేశ్వర రావు, రమేష్ మాస్టారు, కొత్త వెంకటశివరావు పాల్గొన్నారు.

ఫిరగింపురం : ఫిరంగిపురం మండలం కమిటీ ఆధ్వర్యంలో ఫిరంగిపురంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, నాయకులు కె రాఘవయ్య, ఈదర హరిబాబు, జి వెంకటేశ్వరరావు, ఎ అంకమ్మరావు, బాలశౌరి పాల్గొన్నారు. పొనుగుపాడు గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జన జాగరణ కార్యక్రమంలో బాలలు పలు కార్యక్రమాలు ప్రదర్శించారు.

బిజెపి విధానాలను తిప్పికొట్టాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజి

గుజ్జనగుండ్ల సెంటర్‌లో ఆట- పాట


మాట్లాడుతున్న నేతాజి

ప్రజాశక్తి-గుంటూరు

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి పిలుపునిచ్చారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి సిఐటియు పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఏకపాత్రాభినయం, కోలాటం, అభ్యుదయ గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా నేతాజి మాట్లాడుతూ మతం, కులం పేరుతో ప్రజల మధ్య బిజెపి ఐక్యతను దెబ్బతీస్తున్న నేపథ్యంలో వాటికి వ్యతిరేకంగా పోరాడి లౌకిక స్ఫూర్తిని కాపాడాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల కారుచౌకగా అంబానీ, అదానీ వంటి బడా కార్పొరేట్లకు కట్టుబెడుతుందన్నారు. బిజెపి విధానాలను అడ్డుకోకపోతే దేశాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెడుతుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, పశ్చిమ నగర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సత్యనారాయణ, బి.ముత్యాలరావు ప్రసంగించారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ, నాయకులు షేక్.సైదా ఏకపాత్రాభినయం ప్రదర్శిం చారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు వై.పద్మ, నాయకులు లూదర్‌పాల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, సమీర్, సిఐటియు నాయకులు జి.శంకర్, పి.శ్రీనివాస రావు, షేక్.మస్తాన్‌వలి, డొడ్డా కోటేశ్వరరావు పాల్గొన్నారు.




ఏకపాత్రాభినయంలో ఆవాజ్ నాయకులు ఎంఎ చిష్టి




గేయాలాపనలో పిఎన్‌ఎం నాయకులు పద్మ తదితరులు

త్యాగధనుల పోరాట ఫలితమే స్వాతంత్ర్యం



ప్రజాశక్తి-తాడేపల్లి: ఎందరో మహనీయులు, త్యాగధనుల పోరాట ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్య ఫలాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. బైపాస్‌రోడ్డు విఆర్ అపార్టుమెంట్లో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా ఎంటిఎంసి డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి హాజరయ్యారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన గాంధీ మహాత్ముని జీవిత చరిత్ర పాఠ్యాంశాలను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం గురించి వివరించారు. మనకంటే అధిక జనాభా ఉన్న చైనా అభివృద్ధిలో దూసుకుపోతున్న సంగతిని చెప్పారు. మణిపూర్ ఘటన దురదృష్టకరమని ఖండించారు. పిల్లలకు పాఠశాలల్లో జనరల్ విషయాలు చెప్పడంలేదన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు వజ్రా రెసిడెన్సీ అసోసియేషన్ సెక్రటరీ ఎస్.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిఎల్ ప్రకాష్, దానయ్య, వైవి రమణరాజు, శివాజీ, బిజికె ప్రసాద్, ఆర్.ప్రమీలాదేవి, పి.వల్లయ్య, ఉమామహేశ్వరరావు, బి.శివారెడ్డి, కృష్ణవేణి, నాగరాజు, లక్ష్మణరావు, హరి, తేజ పాల్గొన్నారు. అనంతరం వంద మీటర్ల జాతీయ జెండాతో విఆర్ అపార్టుమెంట్ నుంచి బైపాస్‌రోడ్డు, తాడేపల్లి అండర్‌పాస్ మీదుగా మరలా విఆర్ అపార్టుమెంట్‌కు ర్యాలీ చేరుకుంది. ముందుగా రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు.

విద్యుత్ ఉద్యోగుల ఒప్పందాన్ని ఆమోదించొద్దు

ప్రజాశక్తి - రెంటచింతల

యాజమాన్యానికి, విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకుల మధ్య జరిగిన ఒప్పందాన్ని ఆమోదించవద్దని సత్రశాల టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు జేఏసీ కన్వీనర్ సుబ్బారావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వానికి జేఏసీ నాయకులు మధ్య జరిగిన ఒప్పందం తీవ్ర నష్టదాయకమన్నారు. 2014లో 30 శాతం ఫిట్మెంట్, మూడు వెయిటేజీ ఇంక్రిమెంట్లు, 2018లో 25 శాతం ఫిట్మెంట్, మూడు వెయిటేజీ ఇంక్రిమెంట్లు పొందామని, ప్రస్తుత ప్రభుత్వం 16 నెలలు ఆలస్యం చేసి 8 శాతం ఫిట్మెంట్ ఇస్తామనడం దారుణమని అన్నారు. సమావేశంలో వై.వెంకటేశ్వరరావు, జానీబాషా, అమర్నాథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతి

ప్రజాశక్తి - పెదకూరపాడు

గతేడాది పదో తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు పెదకూరపాడు జెడ్‌పి పాఠశాల పూర్వ విద్యార్థులు నగదు ప్రోత్సాహకాలను మంగళవారం అందించారు. షేక్ పర్వానాకు రూ.3 వేలు, నందినికి రూ.2 వేలు, పానుగంటి లక్ష్మీనరసింహకు రూ.వెయ్యి చొప్పున పూర్వ విద్యార్థులు రామకృష్ణ, జాకీర్ అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.వెంకటరమణ పాల్గొన్నారు.



ఘనంగా రాజశేఖర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వైసిపి గుంటూరు, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌కు పలువురు మంగళవారం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. రాజశేఖర్‌తో వైసిపి గుంటూరు జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా, నాయకురాలు నూరీ ఫాతిమా కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

'కృష్ణవేణి'లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - మాచర్ల

ఒకరుచేసే రక్తదానం వల్ల మరొకరు ప్రాణాపాయస్థితి నుండి బయటపడే అవకాశం ఉందని కృష్ణవేణి కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య అన్నారు.



పట్టణంలో కృష్ణవేణి జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఎస్ వి ఆర్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఆధ్వర్యంలో మంగళవారం నీడ్స్ సంస్థ ద్వారా రక్తదానం శిబిరం నిర్వహించారు. నీడ్స్ ప్రతినిధి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పంద్రాగస్టు వేడుకలు



నాదెండ్ల మండలం



మాచర్ల



వినుకొండ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా విలేకర్లు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండాలను ఎగురవేశారు. విద్యాసంస్థల్లో ప్రత్యేకంగా సాంస్కృతిక ప్రదర్శనలతోపాటు పలు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, నాయకుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. యోధుల నుండి స్ఫూర్తిని పొందాలని పిలుపునిచ్చారు.

నాదెండ్ల మండలం మైనంపాడు నైస్ పాఠశాలలో వేడుకలకు నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ జెండాను ఎగురవేసిన ఎంపీ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం కోసం ఎందరో పోరాడారని, త్యాగాలు చేశారని వివరించారు. ఎన్ని ఆస్తులున్నా విద్య మాత్రమే మనిషి ఎదుగుదలకు దోహదపడుతుందని చెప్పారు. పాఠశాల నిర్వాహకులు పి.పూర్ణచంద్రరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

మాచర్ల పట్టణంలోని పలుచోట్ల జాతీయ జెండాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎగురవేశారు. ఎందరో త్యాగమూర్తులు చేసిన త్యాగాల ఫలితంగా మనం ఈ స్వాతంత్ర ఫలాలను అనుభవిస్తున్నామని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు మాజీ చైర్మన్లు టి.కిషోర్, బి.రఘురామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణబాబు, ఎంపిపి బి.శ్రీనివాసరావు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఎగురవేశారు. తహసిల్దార్ క్షమారాణి, ఎంపిడిఒ నరసింహారావు పాల్గొన్నారు.

వినుకొండ పట్టణంలోని పలుచోట్ల జాతీయ జెండాలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎగురవేశారు. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. టిడిపి కార్యాలయం వద్ద జెండాను బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సైదారావు ఎగురవేశారు. కాకతీయ సేవా సమితి కమ్మ బాలికల వసతి గృహంలో జెండాను వ్యవస్థాపక అధ్యక్షులు గడిపూడి వెంకటరాయుడు ఎగురవేశారు. ముఖ్య అతిథులుగా కాకతీయ ట్రస్ట్ హైదరాబాద్ వారి తరపున కార్యదర్శి జి.సత్యనారాయణ, జస్టిస్ చల్ల కోదండరాం, తదితరులు హాజరయ్యారు. 1వ వార్డు బాలికల ఉన్నత పాఠశాలలో పేద విద్యార్థినులైన కె.మేరీ, ఎం.అనూష, ఎన్.వెంకటమ్మ, బి.లేఖన, జె.గాయత్రికి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని హెచ్‌ఎం నాగలక్ష్మి ద్వారా కెనరా బ్యాంక్ మేనేజర్ ఎం.రామకోటేశ్వరరావు అందజేశారు. జూనియర్స్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జెండాను న్యాయమూర్తి యు.రామ్మోహన్ ఎగురవేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు చాగంటి వీరాంజనేయ చౌదరి, కార్యదర్శి కె.హనుమతరావు, న్యాయవాదులు పాల్గొన్నారు. గీతమ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జెండాను కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి ఎగురవేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ప్రిన్సిపల్ ఎం.కృష్ణవేణి పాల్గొన్నారు. జామియా మసీదు ఆవరణలో జాతీయ జెండాను ముతవల్లి షేక్ మస్తాన్‌వలి ఎగురవేశారు. పల్నాడు జిల్లా వఖ్ బోర్డ్ సభ్యులు హాఫీజ్ అద్దంకి గౌస్ బాషా పాల్గొన్నారు. వాసవి క్లబ్, వనిత వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నరసరావుపేట రోడ్డులోని మహాత్మా జ్యోతిరావు పూలే సాంఘిక సంక్షేమ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ప్రెసిడెంట్ చిలంకూరి కోటేశ్వరరావు మాట్లాడారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ ఖజ్జాయం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట పట్టణంలోని పలుచోట్ల జెండాలను ఎగురవేశారు. శ్రీ మద్ది కామయ్య జెడ్‌పి పాఠశాల పసుమర్రులో జెండాను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఎర్రం వెంకటసుబ్బయ్య ఎగురవేయగా హెచ్‌ఎం వై.హనుమంతరావు మాట్లాడారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జెండాను 7వ వార్డు కౌన్సిలర్ చేమిటిగంటి పార్వతీదేవి ఎగురవేయగా హెచ్‌ఎం కె.సుధ మాట్లాడారు. టిట్కో గృహ సముదాయం వద్ద జెండాను వైసిపి పట్టణ అధ్యక్షులు తలహ ఖాన్ ఎగురవేశారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డ్ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. టిడిపి కార్యాలయం వద్ద వేడుకల్లో మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడారు. కాంగ్రెస్ కార్యాలయం వద్ద జెండాను మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి.రామకోటేశ్వరరావు ఎగురవేశారు. సుబ్బయ్య తోటలోని సాయి వికాస్ జెండాను ఆవిష్కరించిన అనంతరం డైరెక్టర్ పవన్ స్వామి మాట్లాడారు.

ముప్పాళ్ల మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు. తహశీల్దార్ భవానీ శంకర్, ఎంపిడిఒ పుట్టారెడ్డి ఎఎస్ఐ హిమామ్, సర్పంచ్‌లు, హెచ్‌ఎంల పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

యాడ్లపాడులోని స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జెండాను ప్రజానాట్య మండలి ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ కార్యదర్శి ఎన్.కాళిదాసు ఎగురవేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ సిహెచ్ సృజనా మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమం, నాటి పోరాట యోధుల గురించి వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. స్కూల్ డైరెక్టర్ అండ్ కరస్పాండెంట్ పోపూరి బ్రహ్మానందం, పోపూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తిమ్మాపురం జెడ్‌పి పాఠశాలలో జెండాను ఎగురవేశారు. సరపంచ్ ప్రభావంతి, పాఠశాల కమిటీ చైర్మన్ మల్లికార్జునరావు, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఖాజావలి పాల్గొన్నారు. గతేడాది పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎలికా సంధ్యాత్రివేణికి స్థానికులు పావులూరి అంజలి నగదు బహుమతిని అందించారు.

రొంపిచర్ల జెడ్‌పి పాఠశాలలో వేడుకలు నిర్వహించగా గతేడాది పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రామానికి చెందిన ఆర్‌ఎంపి వైద్యులు మెండు సత్యనారాయణ నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. సెయింట్ ఫిలోమినాస్ స్కూల్ విద్యార్థులు భారీ జాతీయ జెండాతో ర్యాలీ చేశారు. జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. వివిధ కార్యాలయాల వద్ద అధికారులు, ప్రజాప్రతినిదులు జెండాలను ఎగురవేశారు.

అమరావతి పోలీస్ స్టేషన్లో సీఐ ఏవి బ్రహ్మం, తహశీల్దార్ కార్యాలయంలో విజయశ్రీ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉమాదేవి, అమరావతి కమ్యూనిటీ హాస్పిటల్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ చందులాల్ నాయక్, వైద్యులు, వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో అహ్మద్, అమరావతి పంచాయతీ కార్యాలయంలో రాష్ట్ర వైసీపీ నాయకులు నిమ్మా విజయ సాగర్ బాబు, సర్పంచ్ పాలపర్తి రాజేశ్వరిధరణికోట సర్పంచ్ పావని రాంబాబు, శ్రీ అమరేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వేమూరి గోపి, ఎండ్రాయి సర్పంపంచ్ నాయుడు రాంబాబు, మల్లాది సర్పంచ్ వెంపా నాగలక్ష్మి వాసు, లింగాపురంలో గోపి జెండాలను ఎగురవేశారు.

కారెంపూడి తహశీల్దార్ కార్యాలయంఆవరణలో జాతీయ జెండాను తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్ ఆవిష్కరించి మాట్లాడారు. డిప్యూటీ తహశీల్దార్ కీర్తి స్రవంతి, వీఆర్వోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెంటచింతల మండలంలోని అన్ని గ్రామాలు, కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రెడ్డి నర్సిరెడ్డి, ఎంపిపి డి.చౌడేశ్వరి మాట్లాడారు. గిరిజన పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశారు. రెంటచింతల పంచాయతీ కార్యాలయంలో సర్పంచి పూజల పుష్పవతి రామయ్య, మెయిన్ రోడ్ లోనే గాంధీ బొమ్మల వద్ద కట్టమూరి నాగేశ్వరరావు, తహశీల్దార్ పుల్లారావు విద్యుత్ ఏఈ మస్తాన్వలి టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఎస్సీ వెంకటరమణ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.



పెదకూరపాడు



రొంపిచర్ల





సత్తెనపల్లి



సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీ తులసి సాంబశివరావు జాతీయ జెండాను ఎగురవేశారు. వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, కోటేశ్వరరావు నాయక్, మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ, మేనేజర్ సాంబశివరావు, ఆర్ఒ అప్పారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి, జానీబాష, వైసిపి నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. సుగాలి కాలనీ హైస్కూల్లో జాతీయ జెండాను పిసి కమిటీ చైర్మన్ సుశీల బాయ్ ఎగురవేశారు. ఈ సందర్భంగా 1వ వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు, అమర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ నిజాంపట్నం అమరేంద్ర పాఠశాలకు 500 భోజనం ప్లేట్లను బహుకరించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ పి.బాబురావు, ఎస్.నాగబాబు, మాణిక్యరావు, సిహెచ్ వెంకటాద్రి, లతా ప్రియదర్శిని పాల్గొన్నారు. వైసిసి కార్యాలయం వద్ద జెండాను మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి ఎగురవేశారు. నాయకులు షేక్ నాగుల్ మిరాన్, అచ్యుత శివప్రసాద్ పాల్గొన్నారు.

బెల్లంకొండ చంద్రాజుపాలెం పిహెచ్‌సి వద్ద జాతీయ జెండాను వైద్యాధికారి కె.వి. కోటేశ్వరావు ఎగురవేశారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.మణికుమారి, రాణి పాల్గొన్నారు.

విజయపురిసౌత్ లాంచీస్టేషన్‌లో జాతీయ జెండాను యూనిట్ మేనేజర్ వినయతుల్లా, హరిత రిసార్ట్స్‌లో మేనేజర్ శ్రీనివాస్, ఫ్లై టెక్ ఏవియేషన్‌లో కెప్టెన్ మమత, ఫిల్టర్ హౌస్‌లో రిటైడ్ డిఇ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ అనిల్ కుమార్‌రెడ్డి, తాళ్లపల్లిలో మాజీ జెడ్పీటీసీ శేరెడ్డి గోపిరెడ్డి, ఏపిఆర్జెసి లో ప్రిన్సిపాల్ సరోజిని, ఏపిఆర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వైఎన్‌ఎస్ చౌదరి, పిటిజీ పాఠశాలలో జడ్పీటీసీ మల్లుస్వామి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిఎంసి చైర్మన్ సుబ్రహ్మణ్యం, క్యాంపు 1 పాఠశాలలో వెంకటేశ్వర్లు, క్యాంపు 2లో మల్లికార్జునరావు మువ్వన్నెల జెండాను ఎగురవేశారు.

ఈపూరు తహశీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ అచ్యుత వెంకట సుధాకర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీడీవో ఏవి రంగనాయకులు, పోలీస్ స్టేషన్లో ఎస్సై షేక్ మహమ్మద్ ఫిరోజ్, విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఈ గాంధీబాబు జాతీయ జెండాలను ఎగురవేశారు. గ్రామ సచివాలయాలలో సర్పంచులు, మండల కేంద్రం ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలో పాఠశాల మానిటరింగ్ కమిటీ చైర్మన్‌లు జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీస్ స్టేషన్లో సిబ్బందితో కలిసి ఎస్సై ఫిరోజ్ మొక్కలను నాటారు.

త్యాగధనుల కృషిని నేటి తరానికి తెలియజేయాలి : మేయర్

జిల్లాలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవాలు



ప్రజాశక్తి-గుంటూరు: స్వాతంత్ర్యం కోసం పోరాడిన త్యాగధనుల కృషిని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మేయర్ జెండా ఆవిష్కరణ చేశారు. ఎన్‌సిసి విద్యార్థుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా విధుల్లో ప్రతిభ కనబరచిన నగర పాలకసంస్థ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. సెక్యూరిటీ గార్డ్ లు, పట్టణ ప్రణాళికా విభాగం దళం సిబ్బందికి యూనిఫాం మరియు రక్షణ పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ పెద్ది రోజా, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో.. :జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన స్వాంత్రంత్ర్య దినోత్సవ వేడుకల్లో వై.వి.ఎస్.బి.జి పార్థసారథి జాతీయ జెండా ఎగురవేశారు. అలాగే కార్మిక న్యాయస్థానం చైర్మన్ డి.తిరుమలరావు, గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.వి.కె.సురేష్, జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ టి.సునీత, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పాపిరెడ్డి, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్, న్యాయవాది గుమస్తాల సంఘం అధ్యక్షులు పోతురాజు సాంబశివరావు కోర్టు ప్రాంగణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న జెండాలను ఆవిష్కరించారు.

జెడ్పీ కార్యాలయంలో ..:జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా జెండా ఆవిష్కరణ చేశారు. స్వాంత్రంత్ర్య సమరయోధులను నిరంతరం స్మరించుకోవాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సిఇఒ జె.మోహనరావు, వివిధ విభాగాల సూపరింటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

సిజిజిబి ప్రాంతీయ కార్యాలయంలో..: స్థానిక చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకు, గుంటూరు ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ పి.వీరారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో ప్రతి పౌరుడూ దేశాభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ విద్యాసాగర్, సీనియర్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ డిఐ కార్యాలయంలో..:స్థానిక చౌత్రా సెంటర్‌లోని ఉర్దూ డిఐ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఉర్దూ పాఠశాలల ఉపతనిఖీ అధికారి యం.డి.ఖాసిం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-తెనాలి:భారత స్వాతంత్రోధ్యమం ఒక చారిత్రాత్మక ఘట్టమని, స్వాతంత్రోధ్యమ స్ఫూర్తిని కాపాడుకోవాలని సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు.స్వాతంత్రోధ్యమ స్ఫూర్తితో అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జండా ఎగురవేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ జాతీయ జండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.రవిబాబు, డిప్యూటీ తహశీల్దార్లు, కార్యాలయం సిబ్బబంది, విఆర్వోలు పాల్గొన్నారు. కొలకలూరు పంచాయతీ కార్యాలయంలో జెండా ఏగురవేశారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో 77 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. చైర్పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం జస్వంత్ రావు, వైస్ చైర్మన్లు హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని చంద్రకళ పిజి కళాశాల్లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పొట్టి శ్రీరాములు విద్యాసంస్థల అధ్యక్షులు నంబూరు వెంకటకృష్ణమూర్తి, స్థానిక లక్ష్మీడీలక్స్ కూడలిలోని ఎన్‌ఆర్‌కే అండ్ కేఎస్సార్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పొట్టి శ్రీరాములు ఎడ్యుకేషన్ ట్రస్టు కోశాధికారి రావూరి సుబ్బారావు జాతీయ జండా ఆవిష్కరించారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్‌ఎన్ ఫార్మసి కళాశాల్లో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు, అజాదికా అమృత మహోత్సవ్ ముగింపు వేడుకలు 'మేరే మట్టి-మేరే దేశ్' పేరిట ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వివా, వివిఐటిలో ఘనంగా స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-తెనాలి: వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల, వివా స్కూల్ నంబూరులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్‌సిసి గుంటూరు గ్రూప్ హెడ్ క్వార్టర్ కమాండెంట్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జండా ఆవిష్కరించారు. వివా, వివిఐటి ఎన్‌సిసి విద్యార్థుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులు ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో వివిఐటి చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లిఖార్జునరెడ్డి, రిటైర్డ్ లెఫ్టినెంట్ కమాండర్ కె.శ్రీనివాసరావు, వివా ప్రిన్సిపల్ సిహెచ్ సరళ, ఐబి ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాధవి, కళాశాల ఎన్‌సిసి అధికారులు బిబన్ భాషా, ఆళ్ళ శ్రీవాణి, ఫిజికల్ డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.





తాడికొండ : త్యాగధనుల పోరాట ఫలితమే స్వాతంత్ర్యం అని ట్రిబుల్ ఎక్స్ అధినేత మాణిక్యవేలు అన్నారు. మోతడకలోని ట్రిబుల్ ఎక్స్ కంపెనీలో 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాణిక్యవేల్ జెండా ఎగురవేశారు.

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో అన్ని ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ కార్యాలయాలను స్వాతంత్ర దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కమిషనర్ యు శారదా దేవి, ఏపీఎస్పీ క్యాంపులో కమాండెంట్ కె ఎస్ ఎస్ వి సుబ్బారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మంగళగిరి కోర్టుల ప్రాంగణంలో జాతీయ పతాకాలను న్యాయమూర్తులవిష్కరించారు. పట్నంలో గల ఎస్‌ఎల్‌ఎం చైతన్య హైస్కూల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అదేవిధంగా సిపిఐ, వైసిపి, టిడిపి, జనసేన పార్టీల కార్యాలయాల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు



రాజధాని అమరావతిలోని విట్ విశ్వవిద్యాలయంలో మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి జితేంద్ర చక్రవర్తి పుచ్ఛ పతాకావిష్కరణ చేసారు. ఎన్‌డి ఆర్‌ఎఫ్‌కు చెందిన ఇనస్పెక్టర్, కానిస్టేబుల్ ప్రదీప్ కుమార్, కార్తీక్ లకు, గుంటూరు మున్సిపాలిటీకి చెందిన కార్మికులు ఎం నాగేంద్రం, జి లక్ష్మయ్య లకు, డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ కార్యాలయ అధికారులు డాక్టర్ సిహెచ్ రత్న మన్మోహన్, ఎన్ రామకృష్ణారావును సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.25,000 చొప్పున నగదు పారితోషికం అందించారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్ వి కోట రెడ్డి రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ కె ఖాదీర్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి సుబ్బారావు అధ్యక్షతన ఈ కార్యక్రమానికి వడ్డేశ్వరం గ్రామ వైఎస్‌ఆర్సిపి నాయకులు కత్తిక రాఘవరావు, గొడవర్తి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పాఠశాలలోని జాతీయ జెండాను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నాగజ్యోతి ఆవిష్కరించారు. దేశ స్వాతంత్రం మహానుభావులు తమ ప్రాణాలను ఫణంగా అర్పించారాని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సుబ్బారావు అన్నారు. అనంతరం పాఠశాలలో పదో తరగతి పరీక్షలలోఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కత్తిక రాఘవ రావు ప్రోత్సకా నగదు బహుమతులు మొదటి బహుమతి 2500, రెండవ బహుమతి 1500, మూడో బహుమతి వెయ్యి రూపాయలను విద్యార్థులకు అందచేశారు. ఎం టి ఎం సి పరిధిలోని కుంచనపల్లి జాతీయ రహదారి వద్ద వున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సి.నాగరాజు, పరిపాలనాధికారి శివకుమార్ రాజు, స్టేట్ ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్ ఇంచార్జ్ శాంతిస్వరూప్, ఎంఎం అలీ, ఎస్డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.

పెదనందిపాడు రూరల్ : ఎమ్మార్వో కార్యాలయం వద్ద తహసిల్దార్ మహబూబ్ సుభాని. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ ఎఫ్సిబా. పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ .పి ఏ ఎస్ కళాశాలలో నంది పాఠశాలలో టుబోకో బోర్డు సెక్రటరీ అద్దంకి శ్రీధర్ బాబు .సీనియర్ జర్నలిస్టు ఎస్ ఎస్ లక్ష్మీ లావు. కళాశాల పాలకవర్గ అధ్యక్షులు విశ్రాంతి విజిలెన్స్ ఎస్పీ కాళహస్తి సత్యనారాయణ. జాతీయ జెండాలు ఎగరవేశారు

ఐటి రంగానికి ఉజ్వల భవిష్యత్తు

కార్మికశాఖ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ఐటి రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని కార్మికశాఖ జాయింట్ కమిషనర్ పి.శ్రీనివాస్ అన్నారు. డెలవప్ ట్రీస్ ఐటి వింగ్స్ -2023 వేడుకలు బుధవారం స్థానిక అమరావతిరోడ్డులోని 'ఏ' కన్వెక్షన్ హాలులో జరిగిన ఇంజినీరింగ్ విద్యార్థులు, ఐటి సంస్థల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఇన్‌ఫర్ మేషన్ టెక్నాలజీ ద్వారా ప్రస్తుతం అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. హిందూకళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎస్.వి.ఎస్.లక్ష్మీనారాయణమాట్లాడుతూ కొందరు యువతీ, యువకులు ఉద్యోగాల కోసం దేశాలు దాటి పోతున్నారని, అటువంటి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ డెవలప్ ట్రీస్ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ఈసందర్భంగా పలువురు ప్రముఖులను డెవలప్ ట్రీస్ సంస్థ సీఈవో దగ్గుబాటి శ్రావణ్ కుమార్ ఘనంగా సన్మానించారు. టీమ్ లీడర్లు నవ్య, సిరిలక్ష్మీ మౌళిత తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



ఆర్‌బికెలతో రైతులకు ప్రయోజనం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తెనాలి

వ్యవసాయంలో రైతులకు విత్తనం నుంచి దిగుబడి వరకూ సలహాలిస్తూ రైతు ప్రయోజనాలను కాపాడేందుకే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. రూరల్ గ్రామం సంగం జాగర్లమూడిలో నూతనంగా నిర్మించినఆర్‌బికెను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆర్బీకే ద్వారా గ్రామంలోని రైతులకు రూ.51లక్షల ఆర్థిక సాయం అందించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ ద్వారా ట్రాక్టర్, రోటోవేటర్, కల్టివేటర్లను అందించినట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రం ద్వారా అందించే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ పి.నాగజయలక్ష్మి, ఏడిఏ ఎన్.ఉషారాణి, ఎంపిపి చెన్నుబోయిన శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి జి.ప్రేమ్ సాగర్, డిఈ జివిఎస్ గుప్తా, పంచాయతి కార్యదర్శి విద్యాసాగర్, ఏఎబి చైర్మన్ యన్నం శ్రీనివాసరావు, ఎం.మత్తయ్య, రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.



కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

ఘనంగా ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-తెనాలి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని, స్థానిక శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని మేడిశెట్టి కృష్ణ యూత్ ఆధ్వర్యంలో సముద్రాల పవన్‌కుమార్, పలువురు పార్టీ నాయకులు స్థానిక ఐతానగర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ కేక్‌ను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తనపై అభిమానాన్ని చాటుకున్న అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, పార్టీ నాయకులు కాకి దేవసహాయం, అత్తోట చంటి, బేతాళ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కెనరా బ్యాంకు వితరణ

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

77వ స్వతంత్ర వేడుకలను పురస్కరించుకొని కెనరా బ్యాంకు వారి ఆధ్వర్యంలో కెనరా విద్యా జ్యోతి పథకం కింద దొప్పలపూడి, పచ్చలతాడిపర్రు గ్రామాలలోని జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు, క్లాస్ ఫస్ట్ స్టూడెంట్స్ 12 మందికి ఒక్కక్కరికి రూ. 5000 చొప్పున చెక్కులను రూ.60 వేలు బ్రాంచ్ మేనేజర్ బత్తుల. ఆంజనేయులు, మద్దాల హర్ష సాయి, భువన్ ఆఫీసర్ ప్రసాద్ అందజేశారు. బత్తుల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన తెలిపారు. ముఖ్య అతిథులుగా

సిపిఎం నుండి కుక్కమళ్ల శ్రీనివాసరావు బహిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

చినకాకాని గ్రామ సిపిఎం సభ్యులుగా పనిచేస్తున్న కుక్కమళ్ళ శ్రీనివాసరావు పార్టీ క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడి నందున సిపిఎం పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి బహిష్కరించడం జరిగిందని, మంగళగిరి రూరల్ మండల కమిటీ నాయకులు జి. బాబు వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.


Scan for Location
HELLO LOKESH!
భవిష్యత్తుకు గ్యారెంటీ
సంక్షేమం
అభివృద్ధి
ఇది బాబు గ్యారెంటీ
తేదీ : 16-08-2023 (బుధవారం) మ. 03.00 గంటలకు :
మంగళగిరి మండలం, యర్రబాలెం శివారులో
డాన్ బాస్కో స్కూలు వద్ద యువతతో
"హలో లోకేష్" కార్యక్రమం
RAISE YOUR VOICE
SET THE AGENDA
రండి. కదలిరండి.. తెలుగుదేశం "యువగళం" పిలుస్తోంది
మీ... భాష్యం ప్రవీణ్